'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఉలుకెందుకు.. ఆ పలుకెందుకు?

మనకు పైకి కనిపించే రాజకీయాలు వేరు, కనిపించని లోపలి రాజకీయాలు వేరు. ఇది ఇప్పటి విషయం కాదు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి కూడా ఇదే నడక, ఇదే నడత, ఇదే సంస్కృతి. ఆ సంస్కృతి పేరు కాంగ్రెస్. వందేండ్లుగా తన పార్టీ కొనసాగిస్తున్న రాజకీయ సంస్కృతి బాటలోనే నడుస్తూ, ఒక బలమైన యుద్ధతంత్రంతో దూకుడుగా వ్యవహరించి, శ్రమించి తాను అనుకున్నది సాధించగలిగారు రేవంత్‌రెడ్డి. ఆయన పాటించిన ఆ యుద్ధతంత్రం ప్రజాస్వామికమా, అప్రజాస్వామికమా అన్నది వేరే విషయం. ఆ యుద్ధతంత్రానికి ఆక్సిజన్ అందించిన అత్యంత నికృష్టమైన గోబెల్స్ ప్రచారానికి కూడా మనదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పరోక్షంగా సహకరించిందన్న విషయం కూడా ఇక్కడ అప్రస్తుతం.



మనోహర్ చిమ్మని



ఒక పటిష్ఠమైన యుద్ధప్రణాళికతో ఎలాగైతేనేం రేవంత్‌రెడ్డి అనుకున్నది సాధించారు. తెలంగాణ ప్రజలు కూడా నిజంగానే అదేదో మార్పు అవసరమేమోనని నమ్మారు. ఆత్మహత్యాసదృశ్యమైన ఆ మార్పునకు కారణమయ్యారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సంతోషం. ఇక్కడి వరకూ ఓకే. ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. ఏదైతేనేం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న విషయం ఎవరూ కాదనలేని వాస్తవం.

ఒక వ్యక్తిలో ఉండే భాషా పటిమ, వ్యక్తీకరణలే ఆ వ్యక్తిని ఏ స్థాయికైనా తీసుకెళ్తాయి. మనం వాడే భాష మన సంస్కృతిని తెలుపుతుంది, మనమేంటో ఇతరులకు తెలియజేస్తుంది. ఫక్తు రాజకీయాల కోసం.. ఏదేమైనా సరే ప్రజల్ని రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవడం కోసం.. ఎన్నికలకు ముందు ఏదిపడితే అది మాట్లాడితే చెల్లిందని, ఇప్పుడు కూడా అదే శైలి కొనసాగిస్తానంటే కుదరదు. అసలుకే మోసం వస్తుంది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి విషయంలో జరుగుతున్నది అదే.

తెలంగాణ ప్రజలు మార్పు మాయలో పడి కొట్టుకుపోతూ బంగారు పళ్లెంలో అధికారం అందించి, ముఖ్యమంత్రిని చేశారు. ప్రజలిచ్చిన ఆ పదవిని రేవంత్‌రెడ్డి కాపాడుకోవాలి. ఆ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లెక్కలేనన్ని అంశాల్లో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబెట్టిన తెలంగాణ రాష్ర్టాన్ని, ఆ స్థాయి నుంచి మరింత ఉన్నతమైన స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలి. అభివృద్ధి, సంక్షేమం విషయంలో కేసీఆర్ వేసిన ఎన్నో కొత్తదారుల్ని మరిన్ని కొత్తపుంతలు తొక్కించడం మీద దృష్టిపెట్టాలి. రాష్ట్ర ప్రజల అభిమానాన్ని చూరగొనాలి. కానీ, దురదృష్టవశాత్తూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విషయంలో అలా జరగటం లేదు.

తాను ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నానని అనుకుంటున్నారు రేవంత్‌రెడ్డి. తెల్లారిలేస్తే ఇంకా కేసీఆర్‌తో, బీఆర్‌ఎస్‌తో కొట్లాడుతున్నానని భ్రమపడుతున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా తాను కొనసాగించాల్సిన మహాయజ్ఞం బహుశా ఇదే కొట్లాట, ఇదే తిట్ల పర్వం అనుకుంటున్నారాయన. అందుకేనేమో ముఖ్యమంత్రి హోదాలో దావోస్‌కు వెళ్లినా అవే తిట్లు, లండన్ వెళ్లినా అవే చెత్తమాటలు. ఎక్కడ మైక్ కనిపించినా అవే అరుపులు, కేకలు, అవే బూతుపురాణాలు.


'గోరీ కడతా, బొందపెడతా, వంద అడుగుల లోతున పాతిపెడతా, బిడ్డా బయటికొస్తే బోన్‌లో వేస్తాం'.. ఇవీ నేతాశ్రీ నోటి నుంచి జాలువారిన ఆణిముత్యాలు. అసలేంటీ మాటలన్ని? ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మాట్లాడాల్సిన మాటలేనా ఇవి?

అడ్డా మీద కూలీ నుంచి పైకి ఎదిగిన ఒక గుంపు మేస్త్రీ కూడా కొంచెం ఒద్దికగా ఒక లెవెల్ మెయింటెయిన్ చేస్తారు. ఆచితూచి మాట్లాడుతారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇంకెంత జాగ్రత్తపడాలి? తన మీద, తన మార్పు ఆయుధంపైనా అపారమైన నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల్లో ఇంకెంత గౌరవం పెంపొందించుకోవాలి? కానీ, అలా జరగడం లేదు. 'యథా రాజా తథా ప్రజా'లాగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కూడా 'తొడ కొడితే గుండె పగులుతుంది' అంటూ అదే స్థాయి తిట్ల దండకం, అదే స్థాయి భాషను వాడుతుండటం మరింత శోచనీయం.

డిసెంబర్ 9 నుంచి అమలు చేసి తీరుతామని సవాల్ చేసి ప్రకటించిన 6 గ్యారెంటీల అమలు ఎంత కష్టమో రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యాక బాగా అర్థమైంది. అరకొరగా అమలవుతున్న మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం వల్ల కొత్త ఇబ్బందులు, నష్టాలు మొదలయ్యాయి. గిరాకీల్లేక జీవితం దుర్భరమవడంతో ఆటోవాలాలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రైతుబంధు గురించి అడిగితే చెప్పు దెబ్బలంటున్నారు. కరెంటు కట్ షురూ అయింది. గత పదేండ్లుగా రాష్ట్రంలో ఎలాంటి అసౌకర్యం, కరెంట్ కోతలు లేకుండా జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళ్లిన పరిశ్రమల అధినేతలంతా ఇప్పుడు బిక్కుబిక్కుమంటున్నారు. కొన్ని పరిశ్రమలు, కంపెనీలు పక్కరాష్ర్టాలకు తరలిపోతున్నాయి. రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాల్సింది ఇటువైపు. 'కేసీఆర్ రాష్ర్టాన్ని దోచుకున్నారు, అప్పులపాలు చేశారు' అని చెప్పిందే చెప్పి, అరిగిపోయిన క్యాసెట్‌ను మళ్లీమళ్లీ వినిపించడంపై కాదు.

అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా ఆ దేశాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రధాన ఎజెండాగా ఉండే బ్లూప్రింట్ మారదు. మరింత బాగా పని చేస్తూ సొంత పార్టీ ఇమేజ్‌ను ప్రజల్లో పెంచుకొనే ప్రయత్నం చేస్తారు. అంతే కానీ, ఎదుటి పార్టీ మీద ప్రతీకారం తీర్చుకోవడం కోసం అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బొందపెట్టరు. మరింత పోటీ పడి ప్రజల కోసం, దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తారు. అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారు. అందుకే ఆ దేశాలు అంత శక్తిమంతమైన దేశాలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ గత పదేండ్లలో అలాంటి దృక్పథంతో రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేశారు. తానే ఇంకో వందేండ్లు పాలించాలనుకోలేదు. తన తర్వాతి తరం వాళ్లకు కొత్తదారులు వేశారు. గత 60 ఏండ్లుగా ఎవరూ సాధించలేని ఎన్నెన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేవలం నాలుగైదేండ్లలో అత్యంత విజయవంతంగా సాధించి చూపించారు. తెలంగాణను దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా చేసేందుకు ఎలా ఆలోచించాలో, ఎంతగా కృషి చేయాలో చూపిస్తూ ఒక కొత్త రెడ్ కార్పెట్ దారి వేసిపెట్టారు కేసీఆర్.

ఆ రెడ్ కార్పెట్‌పై హుందాగా నడుస్తూ, ఒక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి మరెంతో సాధించాలి. తనపై నమ్మకం పెట్టుకొన్న ప్రజలను మెప్పించాలి, ఆ ప్రజల జీవనస్థాయిని మెరుగుపరచడం కోసం ఏదైనా చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. అంతే తప్ప, రేవంత్‌రెడ్డి అనగానే అరుపులు, కేకలు, బోన్‌లో పెడతా, బొంద పెడతా వంటి మాటలు తప్ప ఏం లేదు అనుకునేలా చేసుకోవడం నిజంగా బాధాకరం. ఇదిలాగే కొనసాగితే మాత్రం మార్పు కోరిన అదే తెలంగాణ ప్రజలు అసలు సిసలైన మార్పుని వీలైనంత త్వరలోనే సాధించుకుంటారు.



## ప్రజా గాయకునికి ఇదా నివాళి!

నంది అవార్డుకు ప్రజా గాయకుడు గద్దర్ పేరు పెట్టడంపై ఒక వర్గం మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలా స్పందించాలో తెలియక మరో వర్గం మేధావులు మిన్నకుంటున్నారు. పాలకులు తీసుకొచ్చిన మార్పు చరిత్రలో నిలిచిపోతుందని ఇంకో వర్గం మేధావులు సంతోషిస్తున్నారు. వీటిలో ఎవరి వాదనా సరైనది కాదనేది నా భావన.



తాళ్లపల్లి సురేందర్
98497 99893

పాలకులు ముందుగా ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలను తీసుకోవాలి. కొన్నిసార్లు వాటికి మినహాయింపులు ఉండవచ్చు. (అలాంటి సమయాల్లో అన్ని వర్గాల అభిప్రాయాలను తెలుసుకొని నిర్ణయాలు తీసుకోవాలి) అంతేకానీ, 'నేనే రాజు నేనే మంత్రి' అని ఒంటెత్తు పోకడలతో దూకుడుగా ముందుకెళ్తే దాని ఫలితం ప్రస్తుతం మంచిగానే ఉండొచ్చు. కానీ, భవిష్యత్తులో పరిణామాలు వేరే విధంగా ఉండవచ్చు. మీరు తీసుకునే నిర్ణయం మీకే కాదు, వ్యవస్థ మొత్తానికి నష్టాన్ని కలిగించవచ్చు. చరిత్రలో మనం ఇలాంటి సంఘటనలను ఎన్నో చూశాం, చూస్తున్నాం, చూడబోతున్నాం కూడా!

ఇక అవార్డు విషయానికి వస్తే, నంది అవార్డు అని ఒక ప్రత్యేక సందర్భంలో దానికి అలా నామకరణం చేశారు. ఆ చరిత్ర ఇప్పుడు అప్రస్తుతం. అందరికీ తెలిసిందే. కానీ, ఆ అవార్డు పేరును 'గద్దర్ అవార్డు'గా మార్చడమే గందరగోళాన్ని కలిగిస్తున్నది. గద్దర్ ప్రజా గాయకుడు, ప్రజల గొంతుక. అలాంటి గొంతుక మన మధ్య లేకున్నా ప్రతి రోజు మనం తన పేరును తలుచుకునే విధంగా వారి గుర్తులు, ఆలోచనలు ఉండాలి. నేటి యువతరం, పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాలు నిత్యం ఆయన ఆలోచనలను, గుర్తులను మననం చేసుకునేలా ఉండాలి. ఆయన పేరు ప్రతిరోజు వినబడే విధంగా ఉండాలి. గద్దర్ పేరు చెప్తే ఆయన ఆలోచనలు గుర్తుకొచ్చేలా ఉండాలి. ఆ దిశగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలి. కానీ, కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయం, ఆ ఆలోచనలకు తగ్గట్టుగా లేదు. తీసుకున్న నిర్ణయం, చేసిన మార్పు పెద్దదే కావచ్చు, అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. కానీ, నిర్ణయం తీసుకునే ముందు ఒక విషయాన్ని ఆలోచించాల్సింది. నంది అవార్డు ఎంతమంది పేద కళాకారులకు అందుతున్నది? మీరు కేవలం పేరును మార్చగలరు కానీ, విధానాలను మార్చలేరు కదా! నంది అవార్డు కోసం జరిగే రాజకీయాలు ఏంటో అందరికీ విదితమే. కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు.

గద్దర్ కనుక బతికి ఉండుంటే, ఈ ప్రతిపాదిత మార్పును కచ్చితంగా వ్యతిరేకించేవారు. గద్దర్ పేరుని చరిత్రలో చిరస్థాయిగా నిలపాలని పాలకులు భావిస్తే, ప్రతిఒక్కరూ తలుచుకునేలా విశ్వవిద్యాలయానికో, ప్రభుత్వ వైద్యశాలకో ఆయన పేరు పెట్టాలి. గద్దర్ తన జీవితాంతం పేదల కోసం పరితపించారు. సామాన్యుల తరపున న్యాయం కోసం పోరాడారు. అలాంటి వ్యక్తి ఆలోచనావిధానాలు చిరస్థాయిగా నిలవాలనుకుంటే, నూతనంగా నిర్మించబోయే ఏదైనా ప్రభుత్వ భవనానికి గద్దర్ పేరు పెట్టాలి. అది చరిత్రలో మిగిలిపోతుంది!

అంతేకానీ, నంది అవార్డు పేరును తొలగించడం సరైనది కాదు. ఆ అవార్డుకు గద్దర్ పేరు పెట్టడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు. అది గద్దర్ ఆలోచనలకు ఏ విధంగానూ దగ్గరగా లేదు. ఈ నిర్ణయంపై ప్రభుత్వంతో పాటు మేధావులు పునరాలోచన చేయాలి. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి.

## అది మా హక్కు



పేదల పొట్టనింపే ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ నీరుగారుస్తున్నది. మూడేండ్ల కిందట చేసిన పనుల బిల్లులను ఇప్పటివరకు విడుదల చేయడం లేదు. 21 లక్షల మంది ఉపాధి కూలీలకు రావాల్సిన బకాయిలు నిలిచిపోయాయి. బీజేపీని అడుక్కోవడం లేదు. వారి భిక్ష మాకు అవసరం లేదు. అది మా హక్కు.

**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

# బలిపీఠంపై ఆటోవాలా

రెక్కాడితే గానీ డొక్కాడని ఆటోవాలా ఆకలితో అలమటిస్తున్నాడు. జీవితాన్ని దినదిన గండంగా గడుపుతున్నాడు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల ఉపాధిని తీవ్రంగా దెబ్బకొట్టింది.



ఎల్.రూప్‌సింగ్



సమైక్య పాలకుల నిర్లక్ష్య వైఖరి, కుట్రల కారణంగా తెలంగాణ పల్లెల్లోని అనేకమంది యువకులు బొంబాయి, దుబాయి బాటపట్టారు. తల్లిదండ్రులను విడిచి వెళ్లలేని వారు, సాగు భూముల్లేని వారంతా బతుకుదెరువు కోసం ఆటోవాలాల అవతారమెత్తి కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారిలో అత్యధికులు అప్పులు చేసి, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వద్ద లోన్లు తీసుకొని ఆటోలు కొన్నవారేనన్నది జగమెరిగిన సత్యం. పగలనక, రాత్రనక కష్టపడుతూ కుటుంబాలను పోషించుకుంటున్న ఆటోవాలాల జీవితాల్లో కాంగ్రెస్ రాకతో అసలైన 'మార్పు' మొదలైంది.

తెలంగాణలో లక్షల మంది ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 10 లక్షల కుటుంబాలు దీనిపైనే ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయి. పరోక్షంగా మరో 4 లక్షల కుటుంబాలు ఆధారపడుతున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణ ఏర్పాటయ్యాక అందరి బతుకులు బాగుపడ్డట్టే, ఆటోవాలాల జీవితాల్లోనూ వెలుగులు విరజిమ్మాయి. ఆటో డ్రైవర్ల స్థితిగతులు, సాధకబాధకాలపై అవగాహన ఉన్న నేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో వాళ్ల పరిస్థితులు మెరగయ్యాయి. అధికారంలో వచ్చి రాగానే, 2014లో ఒకేఒక్క సంతకంతో ఆటోల రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేసిన మహనీయుడు కేసీఆర్. 2015లో మరో అద్భుతమైన కార్యక్రమాన్ని అప్పటి కేసీఆర్ సర్కార్ అమలు చేసింది. ప్రభుత్వమే బీమా ప్రీమియాన్ని చెల్లించి, రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించి, వారి కుటుంబాలకు అండగా నిలబడ్డారు కేసీఆర్.

హైదరాబాద్‌లో ఆటోల కొనుగోలుకు పర్మిట్లు తీసుకోవడం సమైక్య రాష్ట్రంలో చాలా కష్టంతో కూడుకున్న పని. పర్మిట్లు ఇచ్చేందుకు అప్పటి పాలకులు కావాలనే తాత్సారం చేసేవారు. 2015లో జీవో నెం.36 ద్వారా కేసీఆర్ ఈ విధానాన్ని సమూలంగా మార్చేశారు. ఒకేసారి 8 వేల ఆటోలకు పర్మిట్లు ఇచ్చి ఆటో డ్రైవర్లను యజమానులుగా చేసిన ఘనత కేసీఆర్‌దే. దీంతో పాటు 100 శాతం సబ్సిడీతో 2 వేల మంది మైనారిటీలకు ఆటోలను అందించి వారి కుటుంబానికి ఉపాధి మార్గం చూపించారు.

ఫిట్‌నెస్ పెండింగ్‌లో ఉంటే గడిచిన కాలానికి కూడా రోజుకు రూ.50 చొప్పున పెనాల్టీతో సహా చెల్లించాలంటూ కేంద్రంలోని మోదీ సర్కార్ జీవో నెం.714 తీసుకురాగా దాన్ని కేసీఆర్ సమర్థంగా అడ్డుకున్నారు. తెలంగాణ బిడ్డలు కట్టనవసరం లేదని పేర్కొంటూ, ఆటోవాలాలపై ఆర్థిక భారం పడకుండా కేసీఆర్ ఆదుకున్నారు.

కేసీఆర్ హయాంలో ఏ చింతా లేకుండా బతికిన ఆటో డ్రైవర్లు నేడు ఆర్థిక సమస్యలతో చితికిపోతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం కారణంగా గిరాకీల్లేక ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమవుతున్నాయి. గ్రామాల నుంచి నగరాల వరకు ఇదే పరిస్థితి. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇప్పటికే అనేకమంది తనువులు చాలించారు. తాజాగా ప్రజాభవన్ సాక్షిగా ఓ డ్రైవర్ తన ఆటోను కాల్చేయడం పరిస్థితికి అద్దం పడుతున్నది. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు కూరగాయలు, పూలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లే మహిళా రైతులు, వర్తకులు గతంలో ఆటోలనే ఆశ్రయించేవారు. కానీ, ప్రస్తుతం వారంతా ఎంత రద్దీగా ఉన్నా సరే బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. లక్షల రూపాయలు జీతాలు తీసుకొనే కొంతమంది ఉద్యోగినులు సైతం ఉచిత బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. వివాహాలు, శుభకార్యాలు తదితర కిరాయిలు కూడా ఉండటం లేదు. మహిళలకు ఉచితం కావడంతో వారితో పాటే కుటుంబంలోని పురుషులు కూడా బస్సుల్లోనే తిరుగుతున్నారు.

గిరాకీ లేకపోవడంతో పూట గడవడమే కష్టంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఫైనాన్స్‌లు, ఇంటి అద్దెలు, కుటుంబ ఖర్చులు, ఇతర ఈఎంఐలు చెల్లించడం తలకు మించిన భారంగా మారింది. దీంతో ఈ రెండు నెలల కాలంలో సుమారు 14 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటి కిరాయిలు, ఈఎంఐలను ఊహించుకొని బెంబేలెత్తి గుండెపోటుతో తనువు చాలిస్తున్నారు. జనవరి 5న సతీశ్ గౌడ్, నర్సింహాగౌడ్ (మెదక్ జిల్లా కుచెన్‌పల్లి), వేముల సత్యానారాయణ (స్టేషన్ ఘనపూర్), అనిల్‌కుమార్, అక్బర్ (ఇల్లెందు), రాహుల్ (బండ్లగూడ జాగీర్), ఎస్‌కే గులాం (నాగర్‌కర్నూల్ జిల్లా) ఇలా ఒకరా.. ఇద్దరా.. 14 మంది మరణించి తమ కుటుంబాలను అనాథలను చేసివెళ్లిపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరవాలి. లేకపోతే జరగబోయే అనర్థాలకు రేవంత్‌రెడ్డి సర్కారే బాధ్యత వహించకతప్పదు.

## కాస్త కాలమే మధ్యలో!

పాదాలు పట్టుకొని
పదవుల కొచ్చిన వారు
నోరదుపులేని నాయకులు
ప్రజాస్వామ్యం మరిచి
పెత్తందారీ భావన రక్తం
నిండుగా ఉండగా
చెప్పుతోనే కొడతారు!

అబద్ధాలతోనే అధికారంలోకి
వచ్చామనే మీరు
ఆరు గ్యారంటీలకు
వందరోజుల సమయమడిగినా
ఆగి, అడిగిన
రైతులను మీరు
చెప్పుతోనే కొడతారు!

చెప్పంటే పాదరక్ష కదా!
ఈ విధంగా రైతులను
సన్మానిస్తారు!
ఉచితాలకు ఉలుకు
పలుకు లేక మిమ్మల్ని
గెలిపించినందుకు
చెప్పుతోనే కొడతారు!

వాళ్లు రైతులు
తిరగబడితే
మీ మాట మీకు
ఓట్ల ద్వారా చెల్లిస్తారు!
జై కిసాన్‌లు వారు
మీకు మూల్యం వడ్డీతో
వడ్డిస్తారు!
కాస్త కాలమే మధ్యలో..



డా.గన్నోజు శ్రీనివాసాచారి
85558 99493

